ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
09-12-2024
సోమవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 92 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



# వీటికి మహా డిమాండ్ గురూ!

## ఆన్‌లైన్‌లో కాలు దువ్వుతున్న పందెం కోళ్లు..

సంక్రాంతి.. ఈ పండగ ఏపీలో చాలా స్పెషల్. దానికి కారణం పందెం కోళ్లు. అవును.. కోడి పందేలు చూడాలంటే గోదావరి జిల్లాలకు వెళ్లాల్సిందే. ఈ సీజన్‌లో పందెం కోళ్లకు చాలా డిమాండ్ ఉంటుంది. ఇటు పందెం రాయుళ్ల అభిరుచికి తగ్గట్టు కోళ్ల పెంపకందారులు అప్‌డేట్ అయ్యారు.

సంక్రాంతి వచ్చిందంటే చాలు.. ఏపీలో సందడి వాతావరణం ఉంటుంది. ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో కోడి పందేలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తాయి. ఈసారి కూడా పందేలు జోరుగా సాగే అవకాశం ఉంది. సంక్రాంతి పండగ సమీస్తున్న నేపథ్యంలో.. పందెం కోళ్లకు భారీగా డిమాండ్ పెరిగింది. ఇప్పటి నుంచే పందెం కోళ్ల కోసం పందెం రాయుళ్లు వెతుకుతున్నారు. పందెం రాయుళ్ల కోసం కోళ్ల పెంపకందారులు వెసులుబాటు కల్పిస్తున్నారు. కోళ్లను పెంచే చోటుకు రాకుండానే డోర్ డెలివరీ చేస్తున్నారు. అవును ఇప్పుడు పందెం కోళ్లను ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచుతున్నారు. పెంపకందారులు కోళ్ల ఫొటోలను వివిధ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వాటిని చూసిన వారు తమకు కావాల్సిన వాటిని ఎంపిక చేసుకొని డబ్బులు చెల్లిస్తే.. కోళ్లను వారికి పంపిస్తున్నారు. ప్రస్తుతం పెరూ, ఇండియన్ బ్రీడ్ రన్నింగ్‌లో ఉంది. ఎక్కువ డిమాండ్ వీటికే ఉంది. ఒక్కో కోడి పుంజుకు రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు ధర ఉంటోంది.

...మిగతాది 2 లో



# తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం మూర్ఖత్వం

మార్పులు చేసుకుంటూ పోతే ఎలా?

తెలంంగాణ చరిత్రపై కాంగ్రెస్ కు అవగాహన లేదు- కేటీఆర్

**తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. విగ్రహం మార్పు మూర్ఖత్వమన్నారు. మార్పులు చేసుకుంటూ పోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.**

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం మూర్ఖత్వమని మండిపడ్డారు. ప్రభుత్వం చేయాల్సిన పనులు ఇవేనా? అని ప్రశ్నించారు. మార్పులు చేసుకుంటూ పోతే ఎలా? అని నిలదీశారు. రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు మొదలు కానున్న నేపథ్యంలో ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ అయ్యారు.

...మిగతాది 2 లో

# మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావాలి..

## రేవంత్ రెడ్డి వ్యూహం ఏంటీ?



...మిగతాది 2 లో

**నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈసారి అసెంబ్లీ సమావేశాలు రసవత్తరంగా సాగనున్నాయని పొలిటికల్ సర్కిల్‌లో టాక్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి పదే పదే కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని కోరుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలుకు సంబంధించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఉదయం 10.30 గంటలకు సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఆ తర్వాత బీఏసీ సమావేశం జరుగనుంది. ప్రతీ రోజూ ఉదయం 10.30 గంటలకు అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు ప్రారంభం అవుతాయని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు.**

**జయభేరి, హైదరాబాద్ :**

ఈ శీతాకాల సమావేశాల్లో పలు కీలక చట్టాల ఆమోదానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్ని స్తోంది. ఈ సెషన్‌లోనే పంచాయతీ ఎన్నికలపై చర్చించే అవకాశం ఉంది. కొత్త ఆర్ఓఆర్ చట్టం, బీసీ రిజర్వేషన్, కులగణన సర్వే సహా.. పలు నూతన చట్టాలపై అసెంబ్లీలో చర్చించనున్న ట్లు సమాచారం. ఈ నేపథ్యంలో.. కేసీఆర్ అసెం బ్లీకి వస్తారా.. రారా అనే చర్చ జరుగుతోంది. అదే సమయంలో.. సీఎం రేవంత్ కేసీఆర్‌ను పదే పదే అసెంబ్లీకి ఆహ్వానిస్తున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయ్యింది. దీంతో ఈ అసెంబ్లీ సమావేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది. అసెంబ్లీలో ప్రధాన ప్రతిప క్ష నేత సీటు ఖాళీగా ఉండటం బాలేదని.. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ ఆహ్వానించా రు. కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ఆహ్వానించడం వేనక రాజకీయ వ్యూహం ఉందనే టాక్ వినిపిస్తోంది. అందుకే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా.. రారా అనే చర్చ జరుగుతోంది. బయట ప్రెస్‌మీట్ లు, బహిరంగ సభల్లో మాట్లాడిన విషయాల కంటే.. అసెంబ్లీలో మాట్లాడిన అంశాలకు ప్రాధాన్యత ఎక్కువ ఉంటుంది. అందుకే కేసీఆర్‌ను అసెంబ్లీకి ఆహ్వానించి..

...మిగతాది 2 లో



# సిరియా అధ్యక్షుడు అసద్ దుర్మరణం

విమానాన్ని కూల్చేసిన రెబల్స్..!

సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మరణించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆయన తన కుటుంబంతో కలిసి ప్రయాణిస్తున్న విమానాన్ని తిరుగుబాటుదారులు కూల్చివేసినట్లు సమాచారం. అధ్యక్షుడు బషర్ అల్ అసద్ కుటుంబంతో కలిసి రాజధాని డమాస్కస్ నుంచి బయలుదేరిన కొంతసేపటి ఆ విమానం జాడ లేకుండా పోయింది. దాంతో రెబల్సే దాన్ని కూల్చివేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిరియాలో ప్రభుత్వ, ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటుదార్ల కారణంగా గత 15 ఏళ్ల నుంచి రణరంగాన్ని తలపిస్తున్నది. రెండు వైపుల నుంచి భారీ సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయారు. ఒకరిపై ఒకరు బాంబు దాడులు చేసుకుంటుండటంతో పెద్ద సంఖ్యలో అమాయక ప్రజలు కూడా మరణించారు. దేశమంతా రావణకాష్టంలా మారింది. సిరియా రాజధాని డమాస్కస్‌పై రెబల్స్ పట్టుబిగించడంతో అధ్యక్షుడు అసద్ కుటుంబంతో సహా పారిపోయేందుకు ప్రయత్నించి ప్రమాదం బారిన పడినట్లు తెలుస్తున్నది.



# ధరణి సమస్యల పరిష్కారానికి డీసెంట్రలైజేషన్

త్వరలో 1000 సర్వేయర్ పోస్టులు భర్తీ - మంత్రి పొంగులేటి

**జయభేరి, హైదరాబాద్ :**

ధరణి పోర్టల్ బాధ్యతలు ఎన్ఐసీకి అప్పగించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిపుణుల కమిటీ రిపోర్టు ఆధారంగా ధరణిని ప్రక్షాళన చేస్తామన్నారు. అలాగే ధరణి అప్లికేషన్ పరిష్కారానికి డీసెంట్రలైజేషన్

...మిగతాది 2 లో



# బంగాళాఖాతంలో అల్పపీడనం

## డిసెంబర్ 15 వరకు ఏపీలో అల్పపీడన వర్షాలు

**జయభేరి, హైదరాబాద్ :**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. అల్పపీడనం బుధవారం నాటికి శ్రీలంకతమిళనాడు తీరాలకు చేరే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో డిసెంబర్ 15 వరకు కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ అల్పపీడనం రానున్న 24 గంటల్లో పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ మరింతగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం నాటికి శ్రీలంకతమిళనాడు తీరాలకు చేరే అవకాశం ఉందని తెపింది. దీని ప్రభావంతో డిసెంబర్ 15 వరకు రాష్ట్రంలోని కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

...మిగతాది 2 లో



# మంచు ఫ్యామిలీ ఇంట్లో చెలరేగిన వివాదం

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 8 :**

మంచు ఫ్యామిలీ ఇంట్లో వివాదం చెలరేగింది. తనపై, తన భార్యపై తన తండ్రి టాలీవుడ్ సీనియర్ కథానాయకుడు మంచు మోహన్ బాబు దాడి చేశారని మంచు మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. గాయాలతోనే పీఎస్‌కి వెళ్లిన మనోజ్ మోహన్ బాబుపై హైదరాబాద్‌లోని పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదును అందించాడు. ఇదిలావుంటే తాజాగా మోహన్ బాబు కూడా మనోజ్‌పై ఫిర్యాదు చేశారు. తన కొడుకు మంచు మనోజ్ తనపై దాడి చేశాడంటూ అదే పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు మోహన్ బాబు. ఆస్తులు, స్కూల్ వ్యవహారం విషయంలో తనతో గొడవపడి తనను కొట్టాడు అంటూ మోహన్ బాబు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## వీటికి మహా డిమాండ్ గురూ!

ఈ పెందెం కోళ్లకు ప్రత్యేకించి శిక్షణ ఇస్తారు. ఇందు కోసం కుర్రాళ్లను నియమిస్తారు. వీటిని ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు తీసుకెళ్తారు. వేడినీళ్లతో పోతలు (స్నానాలు) చేయిస్తారు. ఈ పందెం కోళ్లు స్ట్రాంగ్ అవ్వడానికి స్విమ్మింగ్ కూడా చేపిస్తారు. గ్యాస్ పోయ్యి మీద ఇత్తడి పళ్లెం పెట్టి శాకాలు తీస్తారు (వేడి గుడ్డతో అద్దుతారు). గోదావరి జిల్లాలో పందెం కోళ్లను ఎక్కువ పెంచుతున్నారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం వెంకటాపురం గ్రామంలో పామాయిల్ తోటల్లో పెంచుతున్నారు. పందెం కోళ్ల పెంపకంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కొప్పుల నాగు అనే పెంపకందారు వివరించారు. ఒక్కో కోడి పెంపకానికి దాదాపు రూ.25 వేలు ఖర్చు అవుతుందని చెబుతున్నారు.

## కేసీఆర్ అసెంబ్లీకి రావాలి..

ఆయన ముందే బీఆర్ఎస్ వైఫల్యాలను నిలదీయాలని రేవంత్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి.. ఇప్పుడు ఏడాది కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలని రేవంత్ సర్కారు ప్లాన్‌తో ఉన్నట్టు సమాచారం. అసెంబ్లీలో లీడర్ ఆఫ్ ది హౌజ్ ముఖ్యమంత్రి కాబట్టి.. ఆయనకే మాట్లాడే అవకాశం ఎక్కువ ఉంటుంది. దీంతో ఎక్కువగా రేవంత్ వాయిస్ బయటకు వెళ్లే అవకాశం ఉంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఉన్నా.. అధికార పార్టీదే పైచేయి ఉంటుంది. అందుకే అసెంబ్లీకి రావడానికి కేసీఆర్ ఆసక్తి చూపడం లేదనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం కేటీఆర్, హరీష్‌రావు.. బీఆర్ఎస్ తరఫున తమ వాయిస్‌ను గట్టిగా వినిపిస్తున్నారు. అయితే.. రేవంత్ వారితో పోల్చుకోవడం లేదు. అందుకే కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్‌ను నిలదీయాలని కాంగ్రెస్.. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని గులాబీ పార్టీ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. దీంతో ఈసారి అసెంబ్లీ సమావేశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం..

ఈ సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ... ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరూ సమావేశాలకు హాజరవ్వాలన్నారు. అంశాలవారీగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేసీఆర్ ఆరోపించారు. రైతు బంధు, తెలంగాణ తల్లి విగ్రహం, మూసీ, హైడ్రా, గురుకులాలు, విద్యారంగంపై ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీ వేదికగా ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ నిర్బంధ పాలన గురించి అసెంబ్లీ ప్రస్తావించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలు, వైఫల్యాలను ఎత్తి చూపాలన్నారు. ఫిబ్రవరి తర్వాత పార్టీలో అన్ని కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఫిబ్రవరి బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని కేసఆర్ పార్టీ శ్రేణులకు తెలిపారు. కమిటీ ఏర్పాటు తర్వాత సభ్యత నమోదు చేపడతామన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రోటోకాల్ విషయంపై సభలో నిలదీయాలని కేసీఆర్ అన్నారు. ఫార్మాసిటీ ప్రతిపాదనలను, పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను వివరించాలన్నారు. రాష్ట్రప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం, చరిత్రపై కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మూర్ఖంగా, అనాలోచితంగా తెలంగాణ తల్లి రూపురేఖలను మార్చి, తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేసిన ఈ దుర్మార్గమైన పనిని ప్రజల గొంతుకగా అసెంబ్లీ, మండలిలో నిలదీస్తామన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై ప్రజలకు విపరీతమైన ఆవేదన ఉందన్నారు. వారి ఆవేదనకు బీఆర్ఎస్ గొంతుకై నిలుస్తుందన్నారు. తెలంగాణ ప్రజల తరఫున సూటిగా ప్రశ్నిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని సంక్షోభంలో నెట్టిందని ఆరోపించారు. గ్రామాల్లో కనీసం పిచికారీ చేసేందుకు పైసలు ఇచ్చేవారు లేరన్నారు. కనీసం సర్పంచులు కూడా లేరన్నారు.

పల్లె ప్రగతి పేరుతో చక్కగా నడిచి, దేశంలో అత్యుత్తమ గ్రామాలు తెలంగాణలోనే ఉన్నాయన్నారు. అయితే కాంగ్రెస్ ఈ విధానాన్ని నాశనం చేసిందన్నారు. దళితబంధు అమలు చేస్తామని, రూ.12లక్షలు ఇస్తామని మాయమాటలు చెప్పారని కేటీఆర్ మండిపడ్డారు అంబేడ్కర్ అభయహస్తం పేరుతో దళిత బంధు ఇస్తామని చెప్పి ఏడాది దాటిందన్నారు. ఇప్పటి వరకు రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. రైతుబంధులో రెండోవిడత డబ్బులు కూడా ఇవ్వలేదన్నారు.

## ధరణి సమస్యల పరిష్కారానికి..

అమలుచేస్తామన్నారు. 2024 ఆర్వోఆర్ చట్టాన్ని తెస్తున్నట్లు తెలిపారు. ధరణి పోర్టల్ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీకి అప్పగించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నిపుణుల కమిటీ రిపోర్టు ఆధారంగా ధరణి పోర్టల్ ను ఎలా ప్రక్షాళన చేయాలని చూస్తున్నామన్నారు. ప్రజలకు మంచి జరిగేలా ధరణి పోర్టల్‌లో మార్పులు చేస్తామన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. 2020 ఆర్వోఆర్ చట్టంలో లోపాలు సరిచేసి 2024 ఆర్వోఆర్ చట్టం తెస్తున్నట్లు ప్రకటించారు. దేశంలోని 18 ఆర్వోఆర్ చట్టాలను అధ్యయనం చేసి కొత్త చట్టం డ్రాఫ్ట్ తయారుచేశామన్నారు. కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని 9వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదిస్తామన్నారు. ధరణి కొత్త యాప్, కొత్త చట్టం సామాన్యులకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రాత్రికి రాత్రే రద్దు చేసిందన్నారు. అయితే రెవెన్యూ గ్రామాలకు ఒక అధికారి ఉండాలనేది స్థానికులు అభిప్రాయం అన్నారు. "ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా ధరణి పోర్టల్ పై ఫిర్యాదులు వచ్చేవి. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెవెన్యూ అధికారులు, నిపుణులతో ధరణిపై కమిటీ వేశాము. కమిటీ రిపోర్టు ఆధారంగా ధరణి పోర్టల్ ను ఎలా ప్రక్షాళన చేయాలి. ఎలా చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందో చర్చించి దశల వారీగా అమలు చేస్తున్నాము. నేను మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ధరణిలో సీక్రెట్ లేకుండా అందరూ వివరాలు తెలుసుకునే విధంగా మార్చాము. ధరణి ఫిర్యాదులను రిజెక్ట్ చేస్తే అందుకు పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశించాను. అలాగే ధరణిపై వచ్చిన 2.45 లక్షల ఫిర్యాదులను కేవలం కలెక్టర్ క్లియరెన్స్ మాత్రమే కాకుండా వివిధ దశలుగా డీసెంట్రలైజేషన్ చేశాము. ఎమ్మార్వో, ఆర్డీవో, స్పెషల్ కలెక్టర్ (రెవెన్యూ), కలెక్టర్, సీసీఐ... ఇలా 5 దశల్లో ఫిర్యాదు అప్లికేషన్లను పరిష్కరిస్తారు. డిసెంబర్ 1 నుంచి ధరణి పోర్టల్ బాధ్యతలను ఎన్ఐసీకి అప్పగించాం. ధరణిలో గతంలో 33 మాడ్యూల్ ఉండేవి. సామాన్యులకు ఈ మాడ్యూల్స్ అర్థం అయ్యేవి కాదు. ప్రజలు పొరపాటున ఒక మాడ్యూల్ బదులుగా మరో మాడ్యూల్ అప్లై చేస్తే అధికారులు రిజెక్ట్ చేసేవారు. ఈ సమస్యకు పరిష్కారం తీసుకోస్తున్నాం" మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్...25 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చిందని మంత్రి పొంగులేటి తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 20142023 మధ్య కాలంలో కేవలం 1.52 లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మాత్రమే టెండర్లు పిలిచారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ చేసి చూపిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంపైనా బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తుందని ఫైర్ అయ్యారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చొని కబుర్లు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో సర్వే వ్యవస్థను కూడా పటిష్ఠం చేస్తామన్నారు. ఇందుకు 1000 సర్వేయర్ల పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

## ప్లాస్టిక్ ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం...

16వ వార్డు కౌన్సిలర్ బలిజ పద్మా రాజారెడ్డి

జయభేరి, కోరుట్ల :

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామని పట్టణానికి చెందిన 16వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బలిజ పద్మారాజారెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం వార్డులో పలు మహిళా సంఘాల సభ్యులకు జుట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులు వాడడం వల్ల మనిషికి ఎంతో నష్టం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ భూమిలో ఉండిపోయి రాబోయే రోజుల్లో అనేక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించాలని కోరారు. ఏ వస్తువుకు వెళ్లిన మన ఇంటి నుండే బట్ట సంచులను కానీ జుట్ బ్యాగులను తీసుకెళ్లాలని కోరారు. ఇండ్లల్లో నీ చెత్తను రోడ్డుపైన మురికి కాలువలలో వేయకూడదన్నారు. తడి పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ ఆధ్వర్యంలో వచ్చే చెత్త బండికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్పి పావని, మహిళా సంఘాల ప్రతినిధులు, గుడిసెల తుక్కమ్మ, కాశమ్మ బలిజ లావణ్య తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ పాలన సమస్తం.. ప్రజాపీడన పరాయణత్వం



ఏడాది పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైంది
తిట్లు, ఒట్లు, నోట్లు.. కాంగ్రెస్ ఏడాది పాలనపై హరీశ్‌రావు సెటైర్లు




**కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో 'ఏడాది పాలన-ఎడతెగని వంచన' పేరుతో బీఆర్ఎస్ ఛార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏడాది పాలనలో భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం వాటిల్లిందని అన్నారు. నిరసన తెలిపే హక్కు లేదని.. నిరంకుశత్వమే మిగిలిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఎరుగని నిర్బంధ కాండను రుచి చూపిస్తున్నడని చెప్పారు. స్కూళ్ల ముందు పోలీసు పికెట్లు, హాస్టళ్ల ముందు పోలీసు పికెట్లు ఎన్నడన్న చూసినమా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సొంతూరుకు ఎవరైనా పోవాలంటే పోలీసు స్టేషన్‌లో అనుమతి పత్రాలు తీసుకోవాల్సిన దుర్మార్గాన్ని ఎన్నడన్నా విన్నామా? కన్నామా? అని అడగారు. పోలీసులతోనే పోలీసు కుటుంబాలను కొట్టించిన ఘనుడీ ముఖ్యమంత్రి అని విమర్శించారు.**

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 8 :

కాంగ్రెస్ పాలన సమస్తం.. ప్రజాపీడన పరాయణత్వం అని హరీశ్‌రావు అన్నారు. ప్రజాస్వామ్య పాలన అని, భావ ప్రకటనా స్వేచ్ఛ అని, నిరసన తెలిపే హక్కులను కాపాడుతామని అభయహస్తం మేనిఫెస్టో మొదటి పేజీ, మొదటి లైనులో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సోనియమ్మ ఆరు గ్యారెంటీలు ఇస్తే.. నేను ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్య పాలన అందిస్తాన్నడని చెప్పారని.. తీరా చూస్తే ఏడాది పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో 'ఏడాది పాలనఎడతెగని వంచన' పేరుతో బీఆర్ఎస్ ఛార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏడాది పాలనలో భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం వాటిల్లిందని అన్నారు. నిరసన తెలిపే హక్కు లేదని.. నిరంకుశత్వమే మిగిలిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఎరుగని నిర్బంధ కాండను రుచి చూపిస్తున్నడని చెప్పారు. స్కూళ్ల ముందు పోలీసు పికెట్లు, హాస్టళ్ల ముందు పోలీసు పికెట్లు ఎన్నడన్న చూసినమా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సొంతూరుకు ఎవరైనా పోవాలంటే పోలీసు స్టేషన్‌లో అనుమతి పత్రాలు తీసుకోవాల్సిన దుర్మార్గాన్ని ఎన్నడన్నా విన్నామా? కన్నామా? అని అడగారు. పోలీసులతోనే పోలీసు కుటుంబాలను కొట్టించిన ఘనుడీ ముఖ్యమంత్రి అని విమర్శించారు. మీడియాపై ఆంక్షలు విధించిందని.. సోషల్ మీడియాపై కేసులు పెట్టించిందని అన్నారు. రాజకీయకక్షతో తప్పుడు కేసులు పెట్టడం, అవి న్యాయస్థానాల్లో వీగిపోవడం కాంగ్రెస్ ఏడాది పాలనలో సర్వసాధారణంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. చదువుకునే లైబ్రరీల్లో లాఠీఛార్జీ చేసిండ్రని.. నిరుద్యోగుల కన్నీళ్లతో అశోక నగరాన్ని శోక నగరంగా మార్చారని విమర్శించారు. బుల్డోజర్లతో ఇండ్లు కూల్చి పేదల జీవితాలను ఛిద్రం చేశారని అన్నారు. లగచర్ల లంబాడీ బిడ్డల మీద థర్డ్ డిగ్రీని ప్రయోగించారని.. ఎమర్జెన్సీని తలపించారని.. యమభటుల్ని మరిపించారని మండిపడ్డారు. రేవంత్ పాలనను క్లుప్తంగా చెప్పాలంటే తిట్లు కొట్లు, ఒట్లు నోట్లు అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలకు తిట్లు, ప్రజలకు కొట్లు, దేవుళ్ల మీద ఒట్లు, తనకు తన వారికి దోపిడీ సొమ్ము నోట్లు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన తెలంగాణ ప్రజలను సంపూర్ణంగా హతాశులను చేసిందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ చేసిన పదేండ్ల అభివృద్ధిని 12 నెలల్లోనే పాడు చేశారని మండిపడ్డారు. పురోగమన తెలంగాణను తిరోగమన తెలంగాణగా మార్చారని విమర్శించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో సంక్షేమం కూనరిల్లిందని.. సంక్షోభం ముంచుకొస్తుందని హరీశ్‌రావు తెలిపారు. అభివృద్ధి జాడలేదని.. అణిచివేత విరుచుకుపడుతున్నదని అన్నారు. మొత్తం మీద ఏడాది పాలన ఎడతెగని వేదననే మిగిలించిందని పేర్కొన్నారు. ఫిరాయింపులు, దబాయింపులు, బుకాయింపులతో రేవంత్ మార్కు ప్రజా పాలన వర్ధిల్లుతున్నదని విమర్శించారు. ఏడాది పాలనలో ఏం కోల్పోయామో ప్రజలు ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నారని కేసీఆర్ అన్న మాట అక్షర సత్యమని చెప్పారు. సత్యాన్ని జీర్ణించుకోలేని రేవంత్.. ఎగతాళిగా మాట్లాడుతున్నాడని.. ఎగిరెగిరి పడుతున్నాడని చెప్పారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణ ప్రజలు ఏం కోల్పోలేదని రేవంత్ రెడ్డి అంటున్నాడని హరీశ్‌రావు అన్నారు. వ్యవసాయానికి జీవనాడిగా నిలిచిన రైతు బంధును కోల్పోయారని.. మత్స్య కారులు చేప పిల్లల పంపిణీ కోల్పోయారని.. దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన దళిత బంధును కోల్పోయారని.. బీసీలకు బాసటగా నిలిచిన బీసీ బంధును కోల్పోయారని.. బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ కోల్పోయారని.. గర్భిణులు కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్టును కోల్పోయారని.. ఆడబిడ్డలు బతుకమ్మ చీరలు కోల్పోయారని తెలిపారు. మైనార్టీస్ కో క్యాబినెట్ మే బీ జగా నహీ మిలా.. కం సె కం నౌ దిన్ కా జష్న్ మే బీ ఉన్ కా జికర్ నహీ.. షాదీ ముబారక్ కే ఏక్ తులా గోల్డ్ కా కుచ్ పతా నహీ.. ఏక్ సాల్ మే కాంగ్రెస్ నే మైనార్టీస్ కో పూరీ తరహా నజరందాస్ కర్ దియా.. లంబాడి బిడ్డలు మంత్రివర్గంలో స్థానం కోల్పోయారని.. పేద బ్రాహ్మణులు ప్రభుత్వ సహాయాన్ని కోల్పోయారని.. ఇండ్లు కూలిన పేదలు సర్వస్వం కోల్పోయారని.. చివరకు అమ్మ ఒడిలోనో, బడిలోనో ఆనందంగా ఉండాల్సిన పిల్లలు తమ విలువైన ప్రాణాలు కోల్పోయారని.. రాష్ట్ర ప్రజలు ఉజ్వల భవిష్యత్తును కోల్పోయారని చెప్పారు. ఏడాది పాలన ఎడతెగని వేదనను మిగిల్చారని విమర్శించారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం



▶▶ మొదటిపేజీ తరువాయి

అల్పపీడనం ప్రభావంతో కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. కోతకి సిద్ధంగా ఉన్న వరి పంటని వర్షాలకు ముందు కోయరాదన్నారు. కోసినా పూర్తిగా ఆరని పనలను వర్షాల నేపథ్యంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పవేసుకోవడం వల్ల నష్ట శాతాన్ని నివారించుకోవచ్చన్నారు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిచినట్లైతే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5% ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలని సూచించారు. రైతులు పంట పొలాల్లో నిలిచే అదనపు నీటిని బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పండించిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలలో ఉంచాలని, ఉద్యానవన పంట మొక్కలు, చెట్లు పడిపోకుండా నిలబడేందుకు కర్రలు, బాదులతో సపోర్ట్ అందించాలని తెలిపారు. వ్యవసాయ సంబంధిత ఇతర సందేహాలు నివృత్తి కోసం మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

ఆగ్నేయ బంగాళాఖాతం, దాని ఆనుకుని ఉన్న తూర్పు హిందూ మహాసముద్రంపై అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. ఈ నెల 14 లేదా 15 తేదీలలో అండమాన్ సమీపంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది 16, 17వ తేదీల నాటికి ఏపీ, తమిళనాడు వైపు పయనిస్తుందని, దీని ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యపేట జిల్లాలలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.



## ప్రజా పాలన ప్రజా విజయోత్సవ వేడుక

జయభేరి, హైదరాబాద్ :

ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ వేడుకల్లో భాగంగా ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్, హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్, సాంస్కృతిక వేదికలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించారు. ఆస్కార్ విన్నర్ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ సహా ఆయా వేదికలపై పలు ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో పాటు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ప్రజా ప్రతినిధులు, నేతలు ఉన్నారు.

# అయ్యప్ప గోశాలలో గోవులకు పూజలు



జయభేరి, గజ్వేల్, డిసెంబం 08 :

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని క్యాసారం వద్ద గల అయ్యప్ప గోశాలలో ఆదివారం పురోహితులు నంద బాలశర్మ, గోశాల నిర్వాహకులు చాపత్త శ్రీనివాస్, బొగ్గుల సురేష్, అయ్యప్ప గోశాల నిర్వాహక కమిటీ సభ్యులు కూరగాయల రాంబాబు ఆధ్వర్యంలో గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి గోవులకు దాణా సమర్పించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా పురోహితులు నంద బాల శర్మ మాట్లాడుతూ ముక్కోటి దేవతలు కొలువుండే గోవును పూజిస్తే అంతా మంచి జరుగుతుందని, మార్గశిర మాసం సందర్భంగా అయ్యప్ప గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని అన్నారు.గోమాత మరియు హరిహర పుత్ర అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలతో అందరూ బాగుండాలని అయ్యప్ప గోశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ముక్కోటి దేవతల అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఆర్యవైశ్య నాయకులు, గోశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు వరంగా సీఎం సహాయనిధి పథకం

- సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

జయభేరి, మెదక్ :

సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరం లాంటిదని రాష్ట్ర టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మజూరైన చెక్కులను మేడ్చల్ మున్సిపాలిటీ కి చెందిన లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం సహాయనిధి పథకం ఎంతో మేలు చేస్తుందన్నారు. ఆపద సమయంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద ప్రజలకు వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ,మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్వంజరి,మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉదండపురం సత్యనారాయణ,మేడ్చల్ మున్సిపాలిటీ ఎస్ సి సెల్ అధ్యక్షులు దండు శ్రీకాంత్(చింటు),మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి సంతోష్ గౌడ్,యువ నాయకులు వేముల రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,యువకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## అతివేగం తీసింది యువ ప్రాణం

- విద్యుత్ స్తంభాన్ని డీ కొన్న బైక్..
- ఇద్దరు యువకుల మృతి

జయభేరి, మేడ్చల్ :

అతివేగనికి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన పెట్ బషిరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి గుండ్లపోచంపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లిలో నివాసం ఉండే కార్తీక్ రెడ్డి(23) తన స్నేహితుడు అనీల్(23) తో కలిసి కొంపల్లి నుండి గుండ్లపోచంపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో అదుపుతప్పి రోడ్డు ప్రక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని డీ కొట్టడంతో కార్తీక్ రెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందగా తీవ్ర గాయాలపాలైన మరో యువకుడు అనీల్ ను మెరుగైన వైద్యం కోసం చికిత్స కు తరలించగా చికిత్స పొందుతున్న అనీల్ కూడా మృతి చెందాడు. మృతులు ఇద్దరు గత 40 రోజులు అయ్యప్ప స్వామి దీక్షలో ఆధ్యాత్మిక చింతనలో ఉండగా దీక్ష విరమించిన మరునాడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాలలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించిన పెట్ బషిరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ వైర్లు తగిలి గుర్తు తెలియని వ్యక్తి మృతి

- అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న గోద్రెజ్ ఆగ్రో పరిశ్రమ యాజమాన్యం
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు



జయభేరి, డిసెంబర్ 8:

వ్యవసాయ పొలం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం పొన్నాల గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పొన్నాల గ్రామ సమీపంలోనీ గోద్రెజ్ అగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు సంబంధించిన వ్యవసాయ పొలం చుట్టూ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా విద్యుత్ వైర్లు ఏర్పాటు చేశారు. అయితే ఈ వైర్లు ఏర్పాటు చేసే ముందు అటు గ్రామ పంచాయితీ సిబ్బందికి కానీ, గ్రామస్థులకు కానీ ఎలాంటి సమాచారం అందించలేదు. దీని వల్ల మనుషులు కానీ మూగ జీవాలకు ప్రమాదం పొంచి ఉందని పరిశ్రమ యాజమాన్యానికి తెలియక పోవడం గమనార్హం. అయితే ఈ విద్యుత్ వైర్ లు ఏర్పాటు చేయడం మూలంగా సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి చనిపోయి ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు శామీర్ పేట పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యక్తి మృతదేహన్ని పరిశీలించారు. మృతుడు మెరూన్ రంగు షర్ట్, నీలం రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## కార్యకర్తకు అండగా ప్రమాద భీమా

- చెక్కును అందజేస్తున్న మాజీ ఎఫ్డీసీ ప్రతాప్ రెడ్డి

జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 08 :



గత కొన్ని రోజుల క్రితం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త చిక్కుడు కిరణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. ఆదివారం గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖరరావు సహకారంతో బిఆర్ఎస్ పార్టీ నుండి మంజూరైన ప్రమాద బీమా 2 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్సి రాజమౌళి, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వైస్ చైర్మన్ జాకీయుద్దీన్ పట్టణాధ్యక్షుడు నవాజ్ మీరా, టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, నాయకులు ఆకుల దేవేందర్, గుంటుకు రాజు, వార్డు అధ్యక్షుడు బాబా షేర్ అలీ ఉమర్, అహ్మద్, పాల రమేష్ గౌడ్, తదితరులున్నారు.

## గొట్టిపర్తి భాస్కర్ కు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు

జయభేరి, హైదరాబాద్:




మూడు దశాబ్దాలుగా క్వాలిటీ ఎడ్యుకేషన్ కు కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన యాదగిరిగుట్ట ఎస్.వీ.ఎన్ ను ప్రగతి పథంలో నడిపిస్తున్న ఎస్.వీ.ఎన్ డిజిటల్ హైస్కూల్ స్థాపకులు గొట్టిపర్తి భాస్కర్ కు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. హైటెక్స్ లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ట్రస్మా రాష్ట్ర శాఖ అధ్యక్షులు సాదుల మధుసూదన్ ల చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. వేలాది మంది పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతూ వారికి అండగా నిలుస్తున్న సందర్భంగా భాస్కర్ అవార్డుకి ఎంపికయ్యారు. శనివారం హైటెక్స్ లో జరిగిన ట్రస్మాఎడెక్స్ అవార్డుల కార్యక్రమంలో స్కూల్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్న ఎస్.వీ.ఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్ ను పలువురు అభినందించారు. కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి కూడా భాస్కర్ చేసిన సేవలను ప్రశంసించి అభినందించారు. యాదాద్రి జిల్లాలో ఎంతో మంచి విద్యానందిస్తున్న గొట్టిపర్తి భాస్కర్, మాధురి దంపతులను కేంద్ర మంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు.



## రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా ఆంక్షరెడ్డి నియామకం

- ఆంక్షరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆదాసు మహేందర్

జయభేరి, డిసెంబర్ 8:



తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా తూంకుంట ఆంక్షరెడ్డి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా క్షీరసాగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆదాసు మహేందర్, ప్రధాన కార్యదర్శి నల్ల వినోద్, యూత్ అధ్యక్షులు బలిపురం నవీన్, మాజి వార్డు సభ్యులు జంగిర్ సత్యనారాయణ లు కలిసి ఆంక్షరెడ్డినీ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షునిగా తనను గెలిపించిన యువతకు ఎల్లవేళలా రుణపడి ఉంటాననీ ఆంక్షరెడ్డి తెలిపారు. అదేవిధంగా యువత రాజకీయాల్లో క్రియాశీలకంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్తకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన వెల్లడించారు. అనంతరం క్షీరసాగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆదాసు మహేందర్ మాట్లాడుతూ గ్రామంలో యూత్ కాంగ్రెస్ పార్టీనీ బలోపేతం చేసేందుకు శాయశక్తులా పనిచేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని అన్నారు.



## కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కుల పంపిణీ



జయభేరి, మేడిపల్లి :

మేడ్చల్ నియోజకవర్గంలోని ఉమ్మడి ఘటకేసర్ మండలం, కీసర మండలాల లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘటకేసర్ మున్సిపాలిటీ పరిధిలోని నారాయణ ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, పీర్జాదిగూడ నగరపాలక సంస్థ మేయర్ అమర్ సింగ్ హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కీసర RDO, మేడ్చల్ బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ చైర్మన్ పావని జంగయ్య, బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్, పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు భీంరెడ్డి నవీన్ రెడ్డి, సుభాష్ నాయక్, సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, బొడిగె కృష్ణా, యాసారం మహేష్, వివిధ మండలాల తహశీల్దార్లు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి పెళ్లి కానుక కళ్యాణ లక్ష్మీ



జయభేరి, ఘట్కేసర్ :

ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని నారాయణ గార్డెన్ లో జరిగిన కళ్యాణ లక్ష్మి షాదిముబారాక్ చెక్కుల పంపిణీ లో పోచారం మున్సిపల్ 29 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన శాసన మండలి ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి. ఆదివారము ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని నారాయణ గార్డెన్ లో జరిగిన కళ్యాణ లక్ష్మి షాదిముబారాక్ చెక్కుల పంపిణీలో పోచారం మున్సిపల్ 29 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎంఎల్ఏ చామకూర మల్లరెడ్డి, మాజి ఎంఎల్ఏ మలిపెద్ది సుదీర్ రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, కౌన్సిలర్ గొంగల్ల మహేష్, సింగిరెడ్డి సాయి రెడ్డి, కొ అప్షన్ సభ్యులు దాసరి శంకర్, నాయకులు నల్లావెల్లి శేఖర్ ముదిరాజ్, నార్రి కష్యయ్య,ఆకిటి బల్రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మందాడి పెళ్లి వేడుకలో మంత్రి సీతక్క

- నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క



జయభేరి, కేసముద్రం :

కేసముద్రం మండల కేంద్రంలోని హరిహర గార్డెన్లో జరిగిన పెళ్లి వేడుకలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. తిరుమలగిరి ప్రగతి నగర్ కు చెందిన స్వర్గీయ మందాడి రవీందర్ రెడ్డిసరస్వతీల కుమారుడు సాయి కిరణ్ రెడ్డి వివాహం కేసముద్రం కల్వల గ్రామానికి చెందిన స్వర్గీయ కొమ్మాల మల్లారెడ్డి పద్మజ కూతురు శ్వేతా రెడ్డితో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కేసముద్రం మండల కేంద్రంలో జరిగిన ఈ వివాహ వేడుకలకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలకు మంత్రి సీతక్కతో పాటు నేడు దినపత్రిక ఎడిటర్ వెల్లెంకి జయపాల్ రెడ్డిఅనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దస్రు నాయక్, కాంగ్రెస్ నాయకులు రావుల మురళి, పోలేపాక నాగరాజు, గండి శ్రీనివాస్, మెండు శేఖర్ రెడ్డి, కొమ్మాల జహిందర్ రెడ్డి, బంధువులు గూడ లక్ష్మారెడ్డిలలిత, నిమ్మ కృష్ణారెడ్డిఅరుణ, భూపాల్ రెడ్డి కవిత, కొమ్మాల ప్రణయ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ కవితను కలిసిన సోషల్ మీడియా ఇన్చార్జి

✍ జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 08 :

తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చాలా రోజుల తర్వాత మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయింది కానీ ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అడుగడుగునా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల మైండ్ ను డైవర్ట్ చేస్తూ హైడ్రా అని కొడంగల్ లో ఫార్మా కంపెనీ అని ప్రతి విషయంలోనూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చేదాక బిఆర్ఎస్ పార్టీ వెనకడుగు వేయదని బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడైనా ప్రజల పక్షంగానే పనిచేస్తూ ముందుకు పోతుందన్నారు.ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని ధీమా వ్యక్తం చేశారు.

## మానవత్వం చాటుకున్న మాజి మార్కెట్ కమిటీ చైర్మన్



✍ జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 08 :

అనాధ యువతి వివాహానికి ఆర్థిక సహాయం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ చేశారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన ఆందోలు ఆలేఖ్య అనే అమ్మాయి చిన్న వయసులోనే తల్లిదండ్రులు అనారోగ్యంతో మరణించారు.వారిది నిరుపేద కుటుంబం కావడంతో వివాహం ఖర్చులకు గాను ఆదివారం యువతికి 10000 రూపాయలను అందజేశారు. వివాహానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆర్థిక సహాయం చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా యువతి సంరక్షకులు కష్ట సమయంలో మాకు సహాయం చేసిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వారి వెంట మండల సీనియర్ నాయకులు మద్ది రాజిరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ చాడ శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ కో అప్షన్ అహ్మద్ , గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామోద్దీన్, నాయకులు రామగౌడ్, బుచ్చిరెడ్డి, రాములు గౌడ్, అయ్యేలం, బాలయ్య, రాజు, రమేష్, కిష్టారెడ్డి, గోపాల్ రెడ్డి, నాంపల్లి, తదితరులు ఉన్నారు.

## భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి18 మహా పడి పూజ

- అయ్యప్ప శరణు ఘోషతో పులకించిన భక్తులు.. పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



✍ జయభేరి, డిసెంబర్ 8:

శామీర్ పేట మండలం తుర్కపల్లి గ్రామంలోనీ బాలాజీ ఫంక్షన్ హాలులో అయ్యప్ప స్వామి 18 వ మహా పడి పూజ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు నియమ నిష్ఠలతో ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఇక అయ్యప్ప భజన సంకీర్తనలతో ఈ ప్రాంతమంతా మారు మ్రోగింది. కాగా ఈ మహా పడి పూజ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరయ్యారు. అనంతరం పూజకు హాజరైన అయ్యప్ప స్వాములకు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు

- సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు



✍ జయభేరి, పరవాడ:

గత నెల 19, 20, 21 తేదిలలో స్కూల్ గేమ్స్ వారి ఆధ్వర్యంలో మచిలీపట్నంలో జరిగిన బాక్సింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు జి. గౌతమ్, జి.హర్షిత ఎ.హర్షిత లు రేపటి నుండి ఢిల్లీ లో జరుగు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొను చున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి తెలిపారు. ఈ క్రీడాకారులను, కోచ్ అమర్నాథ్, అన్నపూర్ణ లని సంస్కృతి గ్లోబల్ స్కూల్ సీఈఓ కె. నిశాంత్ అభినందనలు తెలుపుతూ జాతీయ స్థాయి పోటీలలో రాణించలని తెలిపారు.

# తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రావాలని కోరిన

- కాలనీలలొని సమస్యలను పరిష్కరిస్తా
- మార్నింగ్ వాక్ లో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

✍ జయభేరి, పరకాల డిసెంబర్ 08:

ఆదివారం ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి రాజధాని టీ స్టాల్, సిఎస్ఐ స్కూల్, కూరగాయల మార్కెట్, భూపాల పల్లి రోడ్డు వరకు మార్నింగ్ వాక్ లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. కూరగాయల మార్కెట్, వీధి వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నావు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలనీ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను స్టానికులను నుండి అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో ప్రధానంగా నీటి, డ్రైనేజీ, రోడ్డు, తదితర పనులను, సమస్యలను గుర్తించడం జరిగిందని, ఈ సమస్యలన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు.



# అంత కమిషనరే..!

## అక్రమ నిర్మాణాలన్నీ ఆయన కనుసన్న లోనే...!?

## ఆయనకు వత్తాసు పలికే నేతల జోరు అధికారులు గప్ చుప్

- నాగారం మున్సిపాలిటీలో యదేచ్చగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వీటిని అడ్డుకునే అధికారులు మాత్రం కొనుక్కు నిద్రపోతున్నారు. అదేమని కమిషనర్ను అడిగితే వేరే పనులు లెవ్వా మాకు ఇవే పనుల అంటూ దబాయింపు.. అంటే చేయి తడుముకున్నాడో ఏమో తెలియదు కానీ దాటవేసే ధోరణి చూస్తుంటే నిజంగా వీళ్లు అధికారుల బాధ్యతలేని వర అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.





✍ జయభేరి, మేడిపల్లి :

నాగారం మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణదారులు ఆడింది ఆట చేసింది పనిగా మారిపోతున్న ఈ తరుణంలో అక్రమ నిర్మాణాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండడం ఒకవైపు ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం కలిగే విధంగా కనిపిస్తోంది. ఒక్క నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో అక్రమంగా ఒక భారీ షెడ్ నిర్మిస్తున్నారనే విషయం కమిషనర్ దృష్టికి తెలిసిన అధికారులు మాత్రం పట్టించుకోరు.. అడిగిన సమాధానం చెప్పరు.. ఇక ప్రజా ప్రతినిధులు మౌనం వహిస్తూ ఇదంతా డ్రామా చూస్తుంటారు.. అక్రమ షెడ్డు నిర్మాణానికి నాగారం మున్సిపల్ కమిషనర్ ప్రజా ప్రతినిధులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లుగా వారి మాటలు వారి ప్రవర్తనలో స్పష్టంగా కనిపిస్తోంది అందుకు దగ్గర సమాచారం కూడా స్పష్టంగా మీడియాకు దొరికింది.. ఇక ఇలాంటి అక్రమ నిర్మాణాలను నిలువరించేందుకు అధికారులను ఒత్తిడి చేసి అడ్డుకోకుండా నేతలు చూస్తున్నట్లు సమాచారం.. తమ ఇష్టానుసారంగా నిర్మిస్తున్న అక్రమ షెడ్డును తొలగించకుండా మీన మేషాలు ఎందుకు లెక్కబెడుతున్నారంటూ ప్రజల్లో నుంచి ఘాటుగా విమర్శలు వినిపిస్తున్నాయి.. అక్రమ నిర్మాణాలతో స్థానికంగా మున్సిపల్ రెవిన్యూ కు ఆదాయం గండిపడటమే కాకుండా మరికొన్ని చోట్ల అక్రమ నిర్మాణాలు చేపట్టే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవడంలో జాతీయ చేస్తే పూర్తిగా నాగారం మున్సిపాలిటీ అవినీతి మయంగా మారిపోయి ఆడిందట పాడిందే పాటగా తయారవ్వక తప్పదు.

**అధికారులు ఒకవైపు ప్రజా ప్రతినిధులు మరొకవైపు.. ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి..**

నగరం మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ప్రజలు ఎంత గగోలు పెడుతున్న ప్రజా ప్రతినిధుల కీలకంగా ప్రజలతో కుమ్మక్కైపోయి నిర్మాణదారులకు దారులు క్లియర్ చేస్తున్నారు... స్థానికంగా రియల్టర్లు కాంట్రాక్టర్లు రెచ్చిపోయి ఎక్కడైనా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు వెంటనే దానిపై కన్ను వేసి తమ సొంతం చేసుకునేందుకు ఎంతవరకైనా తెగిస్తున్నారు.. ఈ నేపథ్యంలో అధికారుల నుంచి వస్తున్న సపోర్టుకు అక్రమ నిర్మాణదారులకు పండగ వాతావరణం నెలకొంటుంది. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు తెలిపినప్పటికీ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు మీనమేషాలు లేక పెడుతున్నారు.. ఒకవైపు ప్రజాప్రతినిలో అంతా తామై ఆయా అక్రమ కట్టడాలకు సహకరిస్తూ భారీగా ప్రభుత్వానికి రావలసిన సొమ్మును పక్కదారి పట్టించి తమ ఖజానాను నింపుకుంటున్నారు.. ఆ డబ్బు కోట్లలో భూములు ధరలు ఉండడంతో భూములకు కూడా విపరీతమైన గిరాకీ పెరిగి అధికారులకు నేతలకు అడ్డదిడ్డంగా ముడుపులు అందిస్తూ ప్రజాప్రతినిధులు అధికారులు తోడుదొంగల మారిపోతున్నారు.. కనీసం హైడ్రా ఒకటి ఉందని అది చూస్తూ ఊరుకోదని తెలిసిన నేతలతో పాటు అధికారులైన స్పందించటం లేదు.. ఇప్పటికైనా హైడ్రా అధికారులు చొరవ తీసుకొని బాధ్యులను కఠినంగా శిక్షించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.






## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

- అందించిన యూత్ నాయకులు

✍ జయభేరి, పరకాల, డిసెంబర్ 08:

పరకాల మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డులోని బొచ్చు శంకర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన యూత్ నాయకులు. వార్డులో ప్రజలకు ఏ సమస్య వచ్చిన యూత్ గా మేము ముందుండి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు బొచ్చు అనిల్, బొచ్చు రాజశేఖర్, బొచ్చు రాజు, బొచ్చు చిరంజీవి, కిషోర్,ఆర్ అనిల్, బొచ్చు కళ్యాణ్, పెరక చరణ్, ఒంటేరు కళ్యాణ్, శశి కుమార్, అభిలాష్ ఈశ్వర్ శ్రీను నితిన్ తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు



✍ జయభేరి, దేవరకొండ :

కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ BRS పార్టీలో చేరిన పి.ఏ పల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ అర్వపల్లి సరిత నర్సింహా, మాజీ మార్కెట్ డైరెక్టర్ ఎర్ర గిరి, వివిధ కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఒక సంవత్సరం అయింది. ఇంతవరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయట్లేదు మాకు విరక్తి చెంది కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి వచ్చినామని తెలియజేసినారు. BRS పార్టీలోకి ఆహ్వానించిన మాజీ శాసనసభ్యులు రవీంద్రకుమార్.

## ఈనెల 17న రాష్ట్రపతి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటన

✍ జయభేరి, అమరావతి, డిసెంబర్ 8 :

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17న ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. గుంటూరులోని మంగళగిరి ఎయిమ్స్ వైద్యకళాశాల స్నాతకోత్సవానికి ఆమె రానున్నారు. రాష్ట్రపతి రాక సందర్భంగా జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎయిమ్స్‌లో సంబంధిత వైద్యాధికారులతో పాటు నగరపాలక, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.రాష్ట్రపతి మంగళగిరికి చేరుకుని ఎయిమ్స్‌లోకి వచ్చే మార్గం, తిరిగి వెళ్లే మార్గంలో అధికారికంగా చేపట్టవలసిన భద్రత ఏర్పాట్లను సంబంధిత అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్రపతి పాల్గొనే సదస్సు ప్రధాన ఆడిటోరియాన్ని పరిశీలించి కార్యక్రమంలో పాల్గొనే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు . కార్యక్రమానికి అవసరమైన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్ఈడీలను ముందుగానే ఏర్పాటే చేసి వాటి పని తీరును సరి చూసుకోవాలని ఆదేశించారు. వీఐపీలు, అధికారులు, ప్రముఖుల వాహన పార్కింగ్ ఏర్పాట్లపై సూచనలు చేశారు.

# పదవ వార్షికోత్సవ సభ కరపత్రం స్థానిక ఐబిలో ఆవిష్కరణ

✍ జయభేరి, దేవరకొండ :




దేవరకొండ నియోజకవర్గంలో సేవలాల్ బంజారా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జరపల రాజేష్ నాయక్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు చందు నాయక్ ఆధ్వర్యంలో దేవరకొండ స్థానిక ఐబి దగ్గర డిసెంబర్ 22 వ తేదీన జరిగే సభను దేవరకొండ నియోజకవర్గ ప్రజలు మేధావులు విజ్ఞానవంతులు ప్రతి ఒక్కరు ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు అనంతరం వారు మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గంలో ప్రజల తరపు ప్రశ్నించే తత్వంగా నాయకులు చురుగ్గా పనిచేయడంతో పాటు ప్రజల ఆశీర్వాదంతో ఇంత స్థాయికి రావడం జరిగింది అలాగే జరగబోయే సభను మరియు మీ ఆశీర్వాదం ఉండాలని ఈ సభను విజయవంతం చేయగలరని మనవి రాబోయే రోజుల్లో సేవలాల్ బంజారా సంఘం నాయకులు పూర్తిస్థాయిలో ప్రజల తరపునుంచి మన నిధులు నియామకాలు కోసం ప్రభుత్వంపై కొట్లాడుతామని అన్నారు ఈ కార్యక్రమంలో సేవాలాల్ బంజారా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డుంగరోత్ మహేష్‌నాయక్ లక్ష్మీపతి నాయక్ పవర్ గణేష్ నాయక్ గణేష్ నాయక్ తులసి రామ్ నాయక్ దేవేందర్ నాయక్ రాజు నాయక్ ముని నాయక్ సేవాలాల్ బంజారా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# మ్యాజిక్ ఎక్స్‌పీరియన్స్ కోసం..


'మిస్టర్ బచ్చన్' సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించింది పూణే భామ భాగ్యశ్రీబోర్సే. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే చేస్తున్న క్రేజీ ప్రాజెక్టుల్లో 'కాంత' ఒకటి. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తూ, రానా దగ్గుబాటితో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సెల్వ మణి సెల్వరాజ్ దర్శకుడు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఇటీవలే ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. రీసెంట్‌గా ఈ సినిమా షూటింగ్ కూడా మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ లొకేషన్‌లో దుల్కర్‌తో కలిసి ఉన్న తన ఫొటోను ఇన్‌స్టాలో షేర్ చేసింది భాగ్యశ్రీ బోర్సే. ''కాంత' ప్రపంచంలో మ్యాజిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఆస్వాదించడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా..' అంటూ ఆ ఫొటోతో పాటు కామెంట్ కూడా జత చేసింది. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో 1950 నాటి మద్రాసు మహానగరంలో జరిగిన కథగా ఈ సినిమాను దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ తెరకెక్కిస్తున్నారు. సముద్రఖని కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు.



# పుష్ప-2 ట్రోల్స్‌పై జాన్వీకపూర్ రియాక్షన్..!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో పుష్ప2 ఈ నెల 5న గ్రాండ్‌గా విడుదైలంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్త రాధిలోనూ పెద్ద ఎత్తున థియేటర్స్‌లో మూవీ విడుదలైంది. అయితే, అక్కడ ఎక్కువగా ఉత్తరాధిలో థియేటర్లు కేటాయించడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. పుష్ప2 కారణంగా హాలీవుడ్ మూవీ ఇంటర్‌స్టెల్లార్ రీ రిలీజ్ వాయిదాపడిందంటూ పలువురు సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారు. క్రిస్టో ఫర్ నోలన్ నటించిన ఈ చిత్రం 2014లో విడుదలవగా.. రిలీజై పదేళ్లైన సందర్భంగా మళ్లీ రీ రిలీజ్ చేయాలని భావించారు. ఐమా క్స్‌ల్లో ఎక్కువగా పుష్ప2 రిలీజ్ కావడంతో ఇక్కడ ఇంటర్‌స్టెల్లార్ రీ రిలీజ్ వాయిదాప డింది. దాంతో పుష్ప2కి ఎక్కువ థియేటర్లు ఇచ్చారంటూ విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ పోస్టు బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కంటపడింది. దీనిపై జాన్వీ కపూర్ స్పందిస్తూ.. హాలీవుడ్ వారంతా భారతీయ సినిమాలను మెచ్చుకుంటున్నారని.. కానీ, మనమే మన చిత్రాలను తక్కువ చేసుకుంటు న్నామంటూ మండిపడింది. పుష్ప2 సైతం ఒక మూవీనేనని.. ఈ సినిమాను మరోదాని తో పోలుస్తూ తక్కువ చేయడం ఎంత వరకు సబబు అంటూ ప్రశ్నించింది.





# రాజమౌళిమహేశ్ ప్రాజెక్ట్ సెట్స్ మీదకి వెళ్ళేది అప్పుడే.!

టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. SSMB29 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందా అని అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. హాలీవుడ్ సినిమాను తలపించేలా ఈ సినిమా ఉండబోతుందని రాజమౌళి ఈ సినిమా గురించి ఇప్పటికే హింట్ ఇచ్చాడు. దీంతో మూవీ ఎలా ఉండబోతుందని అందరూ ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. మరోవైపు ఈ సినిమాను రూ.1000 కోట్ల బడ్జెట్‌తో తెర కెక్కించబోతున్నట్లు సమాచారం. అయితే ఈ మూవీ షూటింగ్‌కు సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ మూవీ షూటింగ్‌ను వచ్చే ఏడాది ఏప్రిల్ మూడో వారం తర్వాత స్టార్ట్ చేయనున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం లొకేషన్లు, నటీనటుల ఎంపికలో రాజమౌళి బిజీగా ఉండడంతో షూటింగ్ మరింత ఆలస్యం అవుతుండడంతో మేకర్స్ ఏప్రిల్‌లో సెట్స్ మీదకి వెళ్లాలని ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. యాక్షన్ అడ్వెంచర్‌గా రూ పొందనున్న ఈ చిత్రంలో ఇండోనేషియన్ బ్యూటీ చెల్సియా ఇస్లాన్ హీరోయిన్‌గా ఎంపికైనట్లు టాక్.

# నిజం సుకుమార్‌కే తెలియాలి

సోషల్ మీడియా వచ్చాక జనాల్లో క్రియేటివిటీ పెరి గిపోయింది. వార్తలు వండటంలో ఒక్కొక్కరూ ఆరి తేరిపోతున్నారనే చెప్పాలి. వాటిల్లో ఎక్కువ శాతం గాలివార్తలే ఉండటం చేత, నిజాలు చెప్పినా నమ్మే పరిస్థితి ప్రస్తుతం సమాజంలో లేదు. రీసెంట్‌గా ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో విపరీ తంగా వైరల్ అవుతున్నది. వివరాల్లోకెళ్తే.. 'పుష్ప 2' హిట్ అవ్వడంతో 'పుష్ప 3' ప్రస్తుతం చర్చ నీయాంశమైంది. 'పుష్ప 2' ఎండింగ్‌లో 'పుష్ప 3ర్యాంపేజ్' అంటూ మూడో పార్ట్‌ని దర్శకుడు సుకుమార్ ప్రకటించేశారు. దాంతో ఇప్పుడు 'పుష్ప 3' గురించి ఆసక్తికరమైన ఓ వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో హల్‌చల్ చేస్తున్నది. 'పుష్ప 3' విజయ్ దేవరకొండ కథానాయకుడిగా ఉంటుందనేది ఈ వార్త సారాంశం. బాంబ్ బ్లాస్టింగ్‌లో శ్రీవల్లి మినహా పుష్పరాజ్ అండ్ ఫ్యామిలీ చనిపోతారట. శ్రీవల్లికి విజయ్ దేవరకొండ పుడతాడట. మూడో పార్టంతా దేవరకొండ చుట్టూనే తిరుగుతుందట. ఇందులో నిజం ఎంతుందో తెలీదుకానీ.. వార్త మాత్రం బలంగానే వినిపిస్తున్నది. వినడానికి కూడా గమ్మత్తుగా ఉంది. మరి ఇందులో నిజం ఆ సుకుమార్‌కే తెలియాలి.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com